చట్టి కుండ

ఒక వంట ఇంట్లో ఉన్న చట్టి కుండలు పరస్పరం అంటుకోకుండా, తట్టుకోకుండా ఉండవన్న సామెత ఉంది. కానీ అందులో ఒక చిక్కుంది. చట్టీ కుండా, ఎంతకావాలంటే అంతగా ముట్టుకోవచ్చు, తట్టుకోవచ్చు కానీ పగిలి పోకూడదు. ఎందుకు పగిలిపోకూడదు!

ఎందుకంటే పగిలి పోయాక తట్టుకోవడానికి, ముట్టుకోడానికి వీలుండదుకదా! ఎంత గొప్ప కుంభరాశి కుండ అయినా ఎంత ప్రసిద్ధమైన మిధునరాశి చట్టి అయినా పగిలిపోయాక ఎలాంటి ప్రభుత్వం వచ్చినా పోయినా ఏవంట ఇంట్లోనయినా పెట్టుకొమ్మని ఆదేశించడానికి వీలులేదు. అది వంట ఇంటి నుంచి బైటికి ఫ్లయింగ్ సాసర్‌లాగ ఎగిరి పోవాల్సిందే. అయితే ఈ అంటు, తట్టుల గురించి ఎవరు అంటుతున్నారు! ఎవరు తట్టుతున్నారు? అన్న సందేహం కలగవచ్చు. చట్టికి మామూలుగా బలం ఎక్కువయినా కూడా కుండ ఆకారం చూచి భయపడి స్వతహాగా అంటుకోడానికిగాని, ముట్టుకోడానికి ధైర్యంచాలదు అందుకే మెల్లగా, చిన్నగా అప్పుడప్పుడు తాకీ తాకనట్లు ఉంటుంది. కానీకుండ అయితే దానికి ప్రతిస్పందనగా కొంచెం గట్టిగానే చట్టిని తట్టుతుంది, అంటుతుంది. అయితే ఇలాంటి తట్టుకోడాన్ని, ముట్టుకోడాన్ని మానవ భాషలో తిట్టుకోవడం. కొట్టుకోవడం అని తర్జుమా చేస్తే తప్పులేదు.

ఇప్పుడు మనం చిన్నగా కథలోని పాత్రలను విశ్లేషిద్దాం. మొదటగా చట్టి వెడల్పు మూతి ఉండడం దేనినీ దాచుకోలేక పోవడం. లోపల ఉన్నది తేలిగా బైటకి కనపడి పోవడం అనే ఈ మూడు లక్షణాలు ఉన్నా చట్టిఫ్రాంక్ అండ్ ఫోర్త్‌రైట్ పురుష పాత్ర. ఇంక కుండ

నోరు చిన్నదిగా ఉండటం, పొట్టపెద్దగా ఉండటం అందువల్ల చాలా సేపు ఆవిరి వదలడానికి అవకాశం ఉంది. చాలా రహస్యాల్ని అది లోపల దాచుకోవచ్చు. ఆకారంలో కుండ మధ్యవయసున్న స్త్రీలా నిత్య గర్భిణిలా ఉంటుంది. ఆడవాళ్ళు ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా మనం మాత్రం కుండకు భార్యపాత్ర ఇచ్చేద్దాం. ఆకారవికార సమర్థనలున్నాయికదా!

ఈచట్టి, కుండ ఉదాహరణ నాకు, నాభార్యకు బాగా సరిపోతుంది. అయితే చట్టిమాదిరి నాకు ఎత్తుతక్కువ కాదు మొత్తం పరిమాణం దృష్ట్యా ఆమె నాకంటె ఎక్కువగా ఉన్నా ఎత్తులో ఆమెకంటె నేను మూడంగుళాలు ఎక్కువే. నాకంటె ఆమెకు పరిమాణం ఎక్కువ కావడానికి తగిన కారణాలుండాలికదా! దానిలో ముఖ్యమైన రెండు కారణాలు వేరే ఏమీకాదు. ఒకటి మటన్ బిరియానీ రెండోది చికెన్ వేపుడు. కానీ ఆమెకు శాకహారముపై మక్కువ లేదన్న ఒక అపోహ మీకు కలిగించాలని కాదు నా ఉద్దేశం. తిండి విషయంలో ఆమె దృష్టిలో రెండేరెండు రకాలున్నాయి. ఒకటి రుచికరమైనది. రెండు రుచి తక్కువ అయింది. గడ్డిరుచికంటె ఎక్కువరుచి ద్విపాదుల, చతుష్పాదుల మాంసానికి ఉంటుంది అనే విషయంలో లోక జనాభాలో 80 శాతం మందినాతో ఏకీభవించ కుండా ఉండడానికి వీల్లేదు. ఇది సాధారణ ప్రకృతి సత్యాలలాగా ఎలాంటి దాపరికం లేని సత్యం. కానీ ప్రకృతి సత్యాలకు విపర్యాయాలు లేవా? పైకి విసిరిన ఏవస్తువైనా కిందికి వస్తుందన్నది సత్యమే. అంటే పైకి వెళ్ళేదంతా కిందికి రాకతప్పదు. కానీ బాహ్యాంత రిక్షం వరకు ఎగురుతూ ఎగురుతూ పోయినా వస్తువులు స్వయంగా తిరిగిరావు. ఛీఛీ! ఈ ఉదాహరణ అంత బాగాలేదు మనం ప్రకృతి సత్యాల గురంచి మాట్లాడేటప్పుడు భూమ్యాకర్షణ పరిధిని మించి మాట్లాడం మర్యాదగాదు. అందుకే ఆకాశంవైపు దూసుకొని పోతున్న ధరల గురించి ఆలోచిద్దాం. వాటిని కిందికి తీసుకొని రావడానికి లేక ఉన్నచోటునే ఆపిపెట్టడానికి మన్మోహన సింహం కాదు సాక్షాత్తు కెపియస్‌గిల్ అనుకుంటే కూడా సాధ్యం కాదని మానవ కోటికి తెలుసు.

అయితే ఆహారం గురించి ప్రస్తావిస్తున్నప్పుడు ఈ కథ దారి తప్పి అరణ్యంలోకి పోయినట్లుంది. మనకథ విషయం చట్టీ, కుండా కదా! నా ఇంట్లో చట్టిని నేనే అని ఒప్పుకోవడంలో నాకు సిగ్గుగాని అవమానంగాని లేదు. కారణం ఏమిటంటే చాలా కుటుంబాలకు ఈవెలితిలేని ప్రకృతి సత్యమే వర్తిస్తుంది. కొంతమంది భర్తలు అంటారు ''ఈ ఇంటి యజమానిని నేనే... ఈ విషయం చెప్పడానికి నా శ్రీమతి అనుమతి ఉంది.''

మరికొంత మంది ''నా కుటుంబంలో అభిప్రాయభేదాలు వచ్చే సమస్యలేదు. కారణం ఏమిటంటే ఈ ఇంట్లో కీలకమైన నిర్ణయాలన్నీ నేనే తీసుకుంటాను. రాష్ట్రస్థాయిలో దూరదర్శన్ అయిదు ఛానల్స్‌ను ప్రారంభించాలా వద్దా? -- కేంద్ర ప్రభుత్వం స్టార్‌టీవికి వ్యతిరేకంగా చర్యలేమయినా మొదలు పెట్టాలావద్దా? పార్లమెంటులో విజయ వంతమయ్యే ఇంపీచ్‌మెంట్ ప్రొసీ డింగ్స్ మళ్ళీ ఎవరి మీదయినా ప్రయోగించి చూద్దామా లేదా? రష్యాతోగాని, అమెరికాతోగాని భారత్ క్రికెట్ ఆడాలావద్దా? గవర్నరు పదవి రద్దుచేయాలా వద్దా? భారతదేశంలో అన్ని నదుల్నీ కలపాలావద్దా? అనే చాలా ప్రధాన చర్చలలో నాభార్యనాకు కొంచెంకూడా వ్యతిరేకించే అభిప్రాయం చెప్పదు. చిన్న చిన్న విషయాల్లో నాభార్య తీసుకొనే నిర్ణయాలలో నేను జోక్యం కలిగించుకోను. పిల్లలకేం పేరు పెట్టాలి? ఇంటికి ఎలాంటి టి.వి, వి.సి.ఆర్. ఫ్రిజ్, కారు మొదలగునవి కొనాలి? పిల్లలు పెరుగుతున్నపుడు వాళ్ళు ఏపై చదువులు చదవాలి? వాళ్ళ జీవిత భాగస్వాములుగా ఎలాంటి వారు రావాలి? ఎవరైనా బర్త్‌డే పార్టీలకు కానీ, పెళ్ళిళ్ళకు కానీ పిలిస్తే వాటికి పోవాలా వద్దా? ఒకవేళ పోవాలంటే ఎలాంటి కానుకల్ని తీసుకొని వెళ్ళి మనసులో తిట్టుకుంటూ ముఖంమీద చిరు నవ్వుతో ఇయ్యాలి? అనే చిల్లర విషయాల్లో నేను జోక్యం కలిగించుకోను.

ఈరకంగా నా ఇంట్లో భారత రాజ్యాంగంలోని కంకరెంట్ లిస్టు లాంటి బోన్ ఆఫ్ కంటెన్షన్ లేకపోవడం వల్ల నా ఇల్లు స్వర్గమే అని అనాలని నాకు కోరిక ఉన్నా నామనస్సాక్షి మాత్రం దానికి పూర్తిగా అంగీకరించడం లేదు.

''చట్టీ కుండా అయితే తట్టుకుంటూ, అంటుకుంటూ ఉంటాయి'' అని నా భార్య అప్పుడప్పుడు అంటుంది. ''కానీ ఈతట్టు, అంటు కార్యక్రమంలో ఏదయినా పగిలితే ఏమవుతుంది'' అని నేనడిగితే ''అలాగేం జరుగదు -- ఈ చట్టి -- ఈకుండ మట్టితో చేసినవికావు స్టీలు -- లేదా అల్యూమినియంతో చేసినవని అనుకోండి'' అని ఆమె అనేది.

ఒకసారి దానికి నేను జవాబు చెప్పాను ''ఏమయినా అల్యూమినియమ్ నేనే అని ఒప్పుకుంటాను --- నీవు స్టీలు అందుకే పరస్పరం తట్టుకుంటూ అంటుకుంటూ ఉంటే సొట్టపడేది అల్యూమినియమ్ కదా''

ఆమెకది కొంచెం కూడా రుచించలేదు.

''మీ ఉద్దేశం నేను లావనేకదా! నా బరువు నేనే మోసుకుంటాను. పెళ్ళి తరువాత బరువు తగ్గించు కుంటానని నేను వాగ్దానం ఏమీ చేయలేదే! కానీ.. మీరేదో పెద్ద ఎండుటాకు అని అనుకున్నారా? శరీరం పుష్టిగా ఉండాలంటే మనసు నిష్కల్మషంగా ఉండాలి''

నేను కొట్లాడ్డానికి చెప్పడం లేదు. నేను లావెక్కకుండా ఉండడం నాకుమంచి మనసు లేక కాదు. తిండిలో మంచి కంట్రోల్, వ్యాయామం చెయ్యడం... అలా కాకుండ నీలాగే సుఖంగా భోం చేసి, కంటి నిండా నిద్రపోతే ఒళ్ళు రాకుండా ఉంటుందా?''

''నా ఒళ్ళు.. నేను భరిస్తాను''

''కానీ భరించాల్సింది నేనేకదా!''

ఇది మాతట్టు అంటులకు ఒకచిన్న ఉదాహరణ అన్నమాట: మా పోట్లాట ఈరకంగా మొదలయినా. అప్పుడప్పుడూ రెండు మూడు రోజులవరకూ అలాగే సాగవచ్చు. అప్పుడు మామధ్య ఆహార, విహార తదితర దైనందిన సంబంధాలు కూడా వర్షకాలంలో టెలిఫోన్ సర్వీసుల మాదిరి అస్తవ్యస్తం కావచ్చు. అలాంటి సంబంధ రహిత మౌన దినాల్లో కూడా చాలా అవసరమైన కొన్ని విషయాలు మాట్లాడుకోక తప్పదు. చిన్న చిన్న ప్రశ్నలకు చిన్న చిన్న జవాబులు కూడ లేకపోతే కుటుంబ జీవితం ముందుకెలా సాగుతుంది? మమ్మల్ని శ్లాఘించాల్సిన ఒకగొప్ప విషయం కూడా ఉంది. ఇంటికి వచ్చే అతిధులకు మా 'శీత సమరం గురించి తెలిసే అవకాశమే ఇవ్వం.

ఇలాంటి లఘు కురుక్షేత్రాలు మా హనీమూన్‌లోనే ప్రారంభయయ్యా యంటే హనీమూన్ తేనెలో ఎప్పటికీ పెళ్ళికాని ఆతేనెటీగలు దురుద్దేశంతో సీమ మిరపకాయ రేణువుల్ని కూడా కలిపి ఉండవచ్చని గట్టిగా అనుకోవాల్సి వస్తుంది.

కల్తీలేని వస్తువులు ఈ ప్రపంచంలో ఎక్కడా దొరకవన్న ప్రస్తుత పరమార్థానికి అవిభాజిత అంశమేనా ఇలాంటి తేనె ఆవిర్భావం? లేక ఈ కార్మిక తేనెటీగల మధ్యలో తీవ్రవాద తేనెటీగలు చొర బడ్డాయేమో అన్నదానికి నిదర్శనమా?

నా ప్రియమైన కుండకి ఒకప్రత్యేక దౌర్బల్యముంది. ఆమెదగ్గర బంధువుల గురించి ఆమె ఎలాంటి విమర్శనూ సహించదు. ఆమెతల్లిదండ్రులు, నలుగురు సోదరులు ఈ ప్రపంచంలో ఉండే మామూలు మనుషుల లాంటి వారుకాదని ఆమె దృఢమైన నమ్మకం.

సెక్స్ గురించి మామూలుగా మాట్లాడడం ఇష్టంలేని ఆమెకు ఆమె తల్లిదండ్రుల మధ్యలో కూడా సెక్స్ ఉండేదని ఈ చట్టి చెప్తే ఆమెకది మంచిగా అనిపించదు.

''ఛీ! ఛీ! నాతల్లిదండ్రుల మధ్యలో అలాంటిదేం లేదు..''

''అయితే మీ పంచ పాండవులెలా పుట్టారు?''

''అంటే నేను స్త్రీని కానే కదా మీరనేది?''

ఇలాంటి వాగ్వివాదం ముదిరి మూడు నాలుగు మౌన దినాలు గడిచి పోయేవి.

మాకు మా ఇరువురు బిడ్డలు కూడా కుండలే. కొన్ని సమయాల్లో నాకనిపిస్తుంది 'ఈ ప్రపంచంలో మగవాడిగా పుట్టే దౌర్భాగ్యం ఎవరికీ లేకపోతే ఎంత బాగుంటుంది' అని అప్పుడు ఈ కుండలన్నీ ఒకదాని కొకటి ముట్టుకొని, కొట్టుకొని పగిలి పోయాక ఆబ్రహ్మదేవుడు అనుకుంటే ముళ్ళీ ఒకసారి అంటని, తట్టని చట్లు, కుండలు సృష్టించ గలుగుతాడేమో.

మా ఇద్దరు లేతకుండలకు కూడ తల్లి కుండ స్వభావమే సంక్రమించింది.

నేను వట్టి హోంలీటైప్. ఇంట్లో వండే ఏతిండి అయినా నాకిష్టమే. బైట హోటల్లో, రెస్టారెంట్‌లో భోం చేయాలంటే నేను వ్యతిరేకం. ఒక్కరోజు బైట భోం చేసే డబ్బుతో మూడు రోజులు ఇంట్లో పండుగ చేసుకోవచ్చని నా అభిప్రాయం.

''హోటల్లో బిల్లు పెద్దది కావడానికి కారణం భోజనం వల్లకాదు, మీతాగుడు వల్ల''

దానికి జవాబియ్యకుండ ఉంటేకూడ ఆమె 'కాల్పుల విరమణ'కు సిద్ధంగా ఉండదు.

''ఎప్పుడో ఒకసారి హోటల్లో భోంచేస్తే ఆకాశమే పడిపోదు. మీకున్న స్నేహితులతో దాదాపు ఎక్కువ మంది భార్యా పిల్లల్ని హోటలికి కనీసం నెలకు నాలుగయిదుసార్లు తప్పకుండా తీసుకొని పోతారు. మాకు కూడ అప్పుడప్పుడు 'ఔటింగ్' అవసరం లేదా?''

ఇలాంటి విషయ సంధులలో 'మౌనమే బంగారం' అనే సిద్ధాంతాన్ని నేను పాటిస్తాను కానీ ఆరకంగా ధవళ పతాకాన్ని నేను చూపిస్తున్నా. కంటికి ముందు అరుణాంబరాన్ని చూస్తున్న వృషభ వీరునిలా నాకుండ ప్రవర్తిస్తుంది.

ఈ విషయంలో నామొదటి లేతకుండ అభిప్రాయం ఇది:

''ఇంట్లో చేసేది ఎంత రుచిగా ఉన్నా, హోటల్‌లో చేసేది ఎంత అరుచిగా ఉన్నా నాకు హోటల్ భోజనమే ఇష్టం''

హెరిడిటీ అనే పాప ఫలానికి ఇంత బలం ఉంటుందా? అని ఆలోచిస్తున్నప్పుడు గంజి తాగి తృప్తి పడేనాకు చాలా దుఃఖంగా ఉంటుంది.

ఇంతవరకు చదివాక పాఠకులకు నామీద సానుభూతి కలుగుతుందేమో. కానీ నిజం చెప్పాలంటే నాకుటుంబ జీవితం అంతకష్టభరిత మేమికాదు. మా ఇరవై సంవత్సరాల

వైవాహిక జీవితం మొత్తం మీద సుఖంగానే గడిచిపోయింది. భోంచేసేటప్పుడు అన్నంలో ఎప్పుడైనా ఒకసారి రాయి పంటికి తగిలితే అది అంత అసాధారణం కాదని, అరుచ్యం కాదనీ నేను అనుకుంటున్నాను. వంట ఇంట్లో పనిచేసే అబ్బాయిగాని. అమ్మాయిగాని పూర్తిగుండు కాకపోతే ఎప్పుడో ఒక అమావాస్యరోజు వాళ్ళు చేసేవంటకంలో ఒక వెంట్రుక పడితే, అది అంత అక్షంతవ్యమైన అపరాధం కాదు. తలమీద ఉన్నవెంట్రుకల్నీ ఎంతో వాత్సల్యంతో పెంచుతున్న మనలాంటి వాళ్ళకు దానిని క్షమించక పోవడం కొంచెం కూడా సమంజసం కాదు. మధురమైన జీవితంలో అప్పుడప్పుడు కారం, చేదు, పులుపు ఒక దొంగ మాదిరి పిలవని పేరంటానికి రాకపోతే మనకంతా ఎప్పుడో మధుమేహం వచ్చివుండాలని నేను అనుకుంటున్నాను. కానీ కొంచెం తెలివి ఉన్న ఏడ్యాక్షరూ నాతో ఏకీభవించడు. ''అనవసరంగా మనిద్దరం అప్పుడప్పుడు ఎందుకిలా పోట్లాడుకుంటున్నాం? దేవుడి దయవల్ల జీవితంలో కావలసినవన్నీ మనకున్నాయి. రత్నాలలాంటి ఇద్దరు పిల్లలున్నారు. అందరకు, 'టచ్‌వుడ్' మంచి ఆరోగ్యం ఉంది. మన మధ్యలో ఎలాంటి సమస్యల్లేవు. అయితే మనం ఎందుకు పోట్లాడుకుంటున్నాం?''

అని 'మన్స్‌ఇన్‌ఎబ్యూమూన్' నా శ్రీమతి సెల్ఫ్‌రియలైజేషన్ వచ్చినట్లు అడుగుతుంది.

''అదే ప్రశ్న నేనూ నిన్నడుగుతున్నాను'' అని నేనంటే ''చూచారా! చూచారా! నేనేదయినా అడిగితేదానికి సమాధానం ఇయ్యకుండ మళ్ళీ అదే ప్రశ్న నన్ను వేస్తారు మనమింక కొంచెం సుఖంగా బ్రతగ్గూడదూ? నాకు పెద్దగా ఏం అక్కర్లేదు. మీరు నన్ను కొంచెం అర్థం చేసుకుంటే చాలు. నాకు కూడ ఫీలింగ్స్ ఉన్నాయి. చిన్న చిన్న విషయాలు చాలు నన్ను సంతోషపెట్టడానికి... అలాగే చిన్న చిన్న విషయాలే నాకు బాధకలిగిస్తాయి. అందుకే మీరు నన్ను ఒక మానవస్త్రీగా, ఒక భార్యగా రిక్గ్నైజ్‌చేస్తే మాత్రం చాలు. మన జీవితం ఎంతో హాయిగా ఉంటుంది. నాకు పెద్ద పెద్ద డిమాండ్స్ ఏమీలేవు. నేను అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టను. వేరే ఆడవాళ్ళు ఏం చేస్తారో మీకు తెలుసుకదా! నేను అలాంటివి ఏమయినా అడుగుతున్నానా? నాకేమివద్దు. కొద్దిగా హార్ట్‌నెస్, కొద్దిగా పీస్ ఆఫ్‌మైండ్ - ఉంటేచాలు. అది కూడా లేదంటే నాకు పిచ్చి ఎత్తి నట్లుగా ఉంటుంది. ఇలాగే సాగిపోతే నేను 'ఎర్రగడ్డ' చేరడానికి ఇంకెంతోకాలం పట్టదు.''

నా 'కుండ' కళ్ళనుంచి, ముక్కునుంచి 'లీక్' ప్రారంభ మయిందని నేను ప్రత్యేకంగా ఇక్కడ ప్రస్తావించ నవసరంలేదు. ''మన మధ్యలో ఎలాంటి అభిప్రాయ వ్యత్యాసాలు లేవు. ఎలాంటి గొడవ కూడా లేదు. ఊరికే కూర్చుని ఏవో ఆలోచించి వాటిని పెద్దవి చేయడంవల్లనే మనశ్శాంతి పోతుంది. ఉన్నదాంతో తృప్తిపడి, లాగే మనస్సుకు కళ్ళాలు.

వేస్తేనే సుఖం ఉంటుంది. ఈ సుఖం, శాంతి అనేవి ఒకమనిషి స్వయంగా అలవర్చుకోవలసినవి. అవి వడ్డించి పెట్టడానికి ఎవరివల్లాకాదు. దానిని డబ్బిచ్చి కొట్లో కొనడానికి వీల్లేదు. అందుకే జీవితాన్ని స్వయంగా సమీక్షించుకో -- బాగా ఆలోచించు -- అంతఃర్ముఖం చేసుకొనిచూడు. బాహ్యంవైపుకాదు. జీవితంలో 'ప్లస్'లు ఏంటి? 'మైనస్'లు ఏంటి? అని సరిగ్గా గణించు. అసంతృప్తినే మనస్సునుంచి తొలగించు. మనల్ని మనపై వాళ్ళతోకాక కింది వాళ్ళతో పోల్చుకుంటే మన మీద దేవుడెంత దయ చూపించాడో అర్థం అవుతుంది. ఎంత డబ్బున్నా, ఎన్ని సౌకర్యాలున్నా దాన్ని బట్టి సుఖంరాదు. దానికి మనసును స్వయంగా కండీషన్ చేసుకోవాలి. సంతోషంకోసం ఏమయినా చదువు, రాయి, మంచిపాటలువిను మెడిటేషన్ చెయ్యి, మంచి కలలుకను -- ఉన్నదానికంతా దేవునికి కృతజ్ఞతలు చెప్పు. అందరికి సుఖం ప్రసాదించాలనీ దేవుణ్ణి ప్రార్థించు --.

వేదాంత శిఖరాలకు నావాచాలతా పక్షాలు నన్ను చేర్చాయి కానీ ...

''ఆపండి -- ఆపండి -- చాలు -- చాలు నేను కూడా ఒక పోస్ట్ గ్రాడ్యుయేట్ అనేవిషయం మీరు మర్చిపోవద్దు; ఈవేదాంతం, తర్క శాస్త్రం నేనూ చదువుకున్నాను -- కానీ మీ నాలికంత పదునుకాదు నా నాలిక. ఏది అడిగి నా తిరిగి నాకు ఉపన్యాసం ఇయ్యడానికి మీకు బాగా చేతనవును. కానీ ఉపన్యాసాలతోనే అన్ని పనులు జరుగుతాయా? ఏదయినా చేసి చూపాలి కదా! -- నేను చెప్పేది ఏదయినా చెయ్యడానికి మీరు సిద్ధంగా ఉన్నారా? మనసులోపల ఉన్న శరీరం ఇదని తెలుసుకునే మనసు మీకుందా? లేక ఈ ఇంట్లో ఉన్న ఫర్నీచర్‌లాగే నన్ను ట్రీట్ చేయడమేనా మీ ఉద్దేశం?'' అని అంటున్న ఆమె కోపాన్ని చూచి నేను మనసులో అనుకున్నాను --

కుమ్మడానికి వస్తున్న అడవిదున్నకు ఎదురుగుండా వేద పారాయణం చేయడం తెలివి తక్కువ - అని.

ఇలాంటి డిస్కషన్లు, డిస్కోర్సులు చాలా జరిగాయి. కానీ మా దాంపత్య నౌక అటుఇటూ ఊగుకుంటూ సాగింది. కానీ ఎప్పుడూ బోర్లా పడలేదు. ఇరవై సంవత్సరాలలో ఇలాంటి వర్షాలు, తుఫాన్లు, కల్లోలాలు రాకుండా ఉంటేనే ఎవరయినా ఆశ్చర్యపడాలి.

కలహాలు ఎంత తీవ్రమైనా నన్ను వదిలి ఒక్కసారి కూడా ఆమె పుట్టింటికి వెళ్ళలేదు.

ఆవిధంగా తీపి, చేదు, కారం పులుపు కలిసిన మా జీవితం సంసార సాగరంలో ప్రయాణం చేస్తుండగా -- ఆకస్మికంగా --

నాకుండ మాతృకలశం అంత పెద్దవయసేంలేదు --

తనకంటె వయసులో చాలా ఎక్కువయిన తన 'చట్టిని' ఏకాకిచేసింది. ఆయన తన నలుగురు కొడుకుల దగ్గర ఉండడానికి ప్రయత్నం చేశాడు. ఎక్కడా వారికి కావలసినంత సుఖం దొరకలేదు.

''నాన్నగారికి ఈ వయసులో కొంత మనశ్శాంతి లభించాలంటే మన దగ్గరకు వచ్చి ఉండకతప్పదు. ఎప్పుడయినా కోడలు కూతురు కాలేదు కదా!'' అని మొదలు పెట్టి మరికొన్ని సమర్థనలను వాటికి జోడించింది. ఆమె చెప్పింది. వింటున్నప్పుడు, విన్నాక నాకు వ్యతిరేక భావమేమి కలగలేదు. కానీ --

''నీకు కావాల్సినంత సుఖం, సంతోషం ఇవ్వలేని నేను -- నీ వయసు మళ్ళిన తండ్రికి ఇవ్వగలనా?'' అని అడగకుండా ఉండలేక అడిగేశాను. ఆమె కళ్ళల్లోకి బోలెడంత తడివచ్చింది.

''మీరు ఎంత గొప్పవ్యక్తో నాకు అర్థంకా లేదని మీరనుకుంటున్నారా? నాన్నగారు రావడంలో నాకంటె ఎక్కువగా సంతోషించేది మీరు, మనపిల్లలు అని నాకు బాగా తెలుసు. ఇప్పుడు ఒక విషయం నేను కచ్చితంగా చెప్తున్నాను. ఇప్పటి నుంచీ నాసుఖం గురించి నేనేం మాట్లాడను. నాన్నగారికి చాలా వయస్సు మళ్ళింది కదా! అమ్మబతికి ఉంటే ఆయకెలాంటి ఇబ్బంది ఉండేదికాదు. అమ్మను పోగొట్టుకున్న దుఃఖంలో ఉన్నారు -- పాపం -- ఆయనకు అమ్మలోటు కనిపించకుండా చూసుకుందాం -- లెట్ హిమ్ నాట్ ఫీల్‌లోన్లీ --

ఆయన అవసాన దశలో కావలసిన సేవలు చేయడం కంటె నాకు ఇంకవేరే అదృష్టం ఏముంది? నాన్నగారు వచ్చాక మనమధ్య ఎలాంటి పోట్లాట ఉండదు -- ఏ మయినా, ఏ పోట్లాట కయినా కారణం నేను కాను. ఆయన ఇక్కడ ఉన్నప్పుడు ఆయనకు ఎలాంటి బాధ కలగకుండా ఉంటానికి మనమంతా కలిసి ప్రయత్నం చేయాలి. మన వర్రీస్‌లో ఎక్కువ భాగం ఇమాజినరీ వర్రీస్ అని నేను ఒప్పుకుంటున్నాను. కానీ నాన్నగారిది ఇమాజినరీ వర్రీకాదు. ఇంక ఎలాంటి అరమరికలు లేకుండా మనం ఉందాం.

గౌతమ బుద్ధునికి కలిగిన జ్ఞానోదయం మాదిరి ఈస్త్రీ -- 'బుద్ధు'కు కలగడం వల్ల వచ్చిన వెరీ లేట్ రియలైజేషన్‌కు నేను బాగా సంతోషించాను. దేవుడికి నేను కృతజ్ఞతలు కూడా తెల్పాను.

కుండవెళ్ళి తండ్రిపాత్రని తీసుకొని వచ్చింది. ఇక్కడ కథ కథనం ముగించడానికి

తగిన వాక్యమేంటి?

తదనంతరం వాళ్ళుహాయిగా చిరకాలం జీవించారు అనే కదా!

నాకుటుంబం విషయంలో ఈ వాక్యంలోని ప్రతి అక్షరమూ నిజమయింది.

ఇప్పుడు వాళ్ళు సుఖంగా, సంతోషంగా బ్రతుకుతున్నారు. ఇంతకూ వాళ్ళంటే ఎవరు? వేరే ఎవరు కాగలరు.

నాకుండ, కుండపిత తప్పించి?

ఆయన శ్రవణ శక్తిలోపంవల్ల పొద్దున మొదలు కొని రాత్రి నిద్రపోయేదాకా ఎన్నిసార్లు వీలుంటే అన్నిసార్లు తనగొంతు ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ నా 'కుండ' సాయుజ్యాన్ని పొందుతోంది.

ఆ సాయుజ్యాన్ని మరింత పెంచడానికి ఆ 'ప్రియ' పిత ఆమె ఒక్కొక్క ఉక్తికి పదిసార్లు.

ఒక చెవి ముందుకు వంచి ''ఆ! ఆ!'' అంటూ దానికి మద్దతు ఇస్తుంటాడు.

తండ్రి ఎల్లవేళలా కూతురు దగ్గరే ఉండాలి. ఉన్నది ఒకటే కూతురు కదా! ఆమెకు తండ్రిపట్ల సేవాభిలాష దినదినాభివృద్ధి అవుతోంది. తండ్రిగారి ఆరోగ్యం, ఆనందమే ఆమెకు 20 సూత్రాల కార్యక్రమం అయింది. ఆరెండు అంశాలకు దశముఖ ప్రయత్నాలు మనసా, వాచా, కర్మణా చేయడం తన ధర్మమని ఆమె భావిస్తోంది.

వారి వార్తా మార్పిడి, పంపిణీ యత్నాలు నాకు చాలా వినోదం కలిగిస్తున్నాయి. ఆశ్రవణ, భాషణ ప్రయత్నాల స్థాయి తారాస్థాయికంటె ఎక్కువయినా వారి బహుముఖమైన చర్చావిషయాలు ఎవరికయినా ఉల్లాసం కలిగిస్తాయి. క్రికెట్, ఎలక్షన్, రైలు ప్రమాదాలు, ఎయిర్‌బస్ పంట పొలాల్లో దిగడం మొదలగునవి మామూలుగా మాట్లాడే విషయాలే అయినా చర్చ తీవ్రంగా జరిగేది చోళీకాపీచే, మైకేల్ జాక్సన్, టియన్ శేషన్, వరల్డ్ బ్యూటీ కాంటెస్ట్, టీవీలో వచ్చే బూతు సినీమాలు మొదలగు వాటి మీదనే.

ఇదంతా అయ్యాక నా'కుండ' కు మిగిలి ఉన్న చాలా తక్కువ ఖాళీ సమయంలో నాతో జరపవలసిన తట్టు, అంటు కార్యక్రమం మంద్రస్థాయిలో ఈ రోజు కూడా జరుగుతున్న విషయంలో నేను తృప్తి పొందకుండా ఉండడానికి వీల్లేదన్నది కూడ నిజమే.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక నిర్వహించిన హాస్య కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)

6-7-95 నాటి ఆంధ్రభూమి సచిత్రవార పత్రికలో ప్రచురితం

★